


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 272 శనివారం 24 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఏడు గంటలు కేటీఆర్ విచారణ

### కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లు,

### ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ ఆరా

### కొన్నింటికి మాజీమంత్రి ఎదురు ప్రశ్నలు

### జూబ్లీహిల్స్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన



**హైదరాబాద్ :జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏడు గంటలకు పైగా సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కోట్లాది రూపాయలు సేకరించడం, ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ అంశాలపై సిట్ కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ సిట్ ఇచ్చిన నోటీసు మేరకు శుక్రవారం ఉదయం 10:50 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి కేటీఆర్ భారీ ర్యాలీగా చేరుకున్నారు. బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి పలువురు నాయకులు భారీ సంఖ్యలో కార్యకర్తలతో కేటీఆర్ ఊరేగింపుగా రావడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి 200 అడుగుల దూరంలోనే కార్యకర్తలు, ఇతర నాయకులను పోలీసులు ఆపేశారు.కేవలం కేటీఆర్ కారును మాత్రమే ఏసీపీ కార్యాలయంలోకి అనుమతించారు.
మిగతా 2లో...



2లో.

# కేరళలో కొత్త రైళ్లకు ప్రధాని మోదీ పచ్చజెండా..

### తెలుగు రాష్ట్రాలకు మరో సర్వీస్

కేరళలో మూడు అమృత్ భారత్, ఒక ప్యాసింజర్ రైలును ప్రారంభించిన ప్రధాని

తిరువనంతపురం నుంచి తెలంగాణలోని చర్లపల్లికి కొత్త అమృత్ భారత్ సర్వీసు

నాన్-ఏసీ కోచ్‌లలోనూ సీసీటీవీ, చార్జింగ్ సాకెట్ల వంటి మెరుగైన సౌకర్యాలు

సామాన్యులకు తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణం లక్ష్యంగా ఈ రైళ్లు

# సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

### బాసర, వర్గల్‌లో జోరుగా అక్షరాభ్యాసాలు

### ప్రత్యేక పూజలు చేపట్టిన భక్తులు

నిర్మల్, **జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
దేశవ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను భక్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్య, జ్ఞానం, వాక్చాతుర్యానికి దేవతగా పరిగణించే సరస్వతి దేవికి అంకితం చేయబడింది. జ్ఞానం, విద్య, కళలలో విజయం కోరుతూ ప్రజలు సరస్వతి దేవిని పూజిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సృజనాత్మక రంగాలలో ఉన్నవారికి చాలా ముఖ్యమైనది. మారుతున్న ఋతువుల ప్రారంభం, వసంతకాలం ఆగమనాన్ని సూచిస్తుంది. వసంత పంచమి నాడు సరస్వతి దేవిని భక్తగా పూజించడం వల్ల చదువుపై దృష్టి పెట్టడానికి, జీవితంలో సానుకూల మార్పులు వస్తాయని నమ్ముతారు. దీంతో పలు ఆలయాల్లో ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలోని బాసర,వర్గల్, ఓయూ క్యాంపస్ తదితర సరస్వతీ ఆలయాల్లో విద్యార్థుల సందడి కనిపించింది. అక్షరాభ్యాసాలకు చిన్నారులు తరలివచ్చారు. మిగతా 2లో...



# ఉద్యమ కేసులతో ట్యాపింగ్ కేసుకు పోలికా?

### కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి: మహేశ్‌గౌడ్

### కవితను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని చెప్పానని వెల్లడి



**హైదరాబాద్, జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రమైనదని, ఈ కేసును తెలంగాణ ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ట్యాపింగ్ కేసు ఎంత తీవ్రమైనదో టెలిగ్రాఫ్ చట్టం చదివితే తెలుస్తుందని.. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మార్పు ఉండబోదన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న మిగతా 2లో...

# అనధికార లే ఔట్ల రెగ్యులేషన్ గడువు పొడిగింపు

### ప్రభుత్వం ప్రకటన విడుదల


2లో.

# వ్యవసాయం ఓ విజ్ఞానం

### జై కిసాన్‌కు తోడు..జై విజ్ఞాన్..జై అనుసంధాన్

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు -సూర్యాపేటలో పలు కార్యక్రమాలకు హాజరు

సూర్యాపేట,**:జనవరి 23(జర్నలిస్ట్ వార్త);** 'వ్యవసాయం ఒక విజ్ఞానమని' ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, మట్టపల్లి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించి లబ్దిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ
మిగతా 2లో...



# నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం

### మాజీ ఎమ్మెల్యే మెతకు ఆనంద్‌కు స్పీకర్ నోటీసులు



వికారాబాద్,**:జనవరి 23(జర్నలిస్ట్ వార్త);:** వికారాబాద్ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌కు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ లీగల్ నోటీసులు పంపారు. తన న్యాయవాది ద్వారా ఈ నోటీసులు పంపిన స్పీకర్.. పలు అంశాలను అందులో ప్రస్తావించారు. ఆనంద్ తనపై నిరాధార ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మానసికంగా క్షోభ పెట్టినందుకు మాజీ ఎమ్మెల్యే రూ.10కోట్ల మిగతా 2లో...

# అమెరికా మరో సంచలన నిర్ణయం

### డబ్ల్యూహెచ్‌వోనుంచి వైదులుగుతున్నట్లు ప్రకటన

వాషింగ్టన్:**జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అనేక విషయాల్లో దూకుడుగా వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కార్ ఇప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వోనుంచి అధికారికంగా వైదొలిగింది.రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. మిగతా 2లో...




# ముగిసిన మిథున్ రెడ్డి ఈడీ విచారణ..

### మీడియాతో మాట్లాడేందుకు నిరాకరణ

### మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేసిన దర్యాప్తు సంస్థ

### కోర్టు ఆదేశాల వల్ల వివరాలు వెల్లడించలేనని స్పష్టం చేసిన ఎంపీ

**జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
ఏపీ మద్యం కుంభకోణం (ఏపీ లిక్కర్ స్కామ్) కేసులో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ కేసులో భాగంగా వైసీపీ రాజంపేట ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (మిగతా 2లో...





## సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాసర పుణ్యక్షేత్రం. భక్తుల తో కిక్కిరిసిపోయింది. వసంత పంచమి సందర్భంగా అమ్మవార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ప్రత్యేక అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు మొదలయ్యాయి. వేకువ జామునుంచే భక్తుల రద్దీ కొనసాగుతోంది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచి చదువుల తల్లి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. చిన్నారుల అక్షర శ్రీకార పూజలు.. గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు కొనసాగాయి. వసంత పంచమిని పిల్లలకు పాఠశాల విద్య ప్రారంభించడానికి శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున చిన్న పిల్లలకు మొదటిసారి రాయడం నేర్పించడం లేదా విద్యకు సంబంధించిన ఏదైనా కొత్త అడుగు వేయడం శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున పేద పిల్లలకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు లేదా పెన్నులు దానం చేయడం కూడా పుణ్యప్రదంగా పరిగణిస్తారు. ఈ క్రమంలో అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున అక్షరాభ్యాసాలు సాగాయి.

## ముగిసిన మిథున్ రెడ్డి ఈడీ విచారణ..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయంలో ఆయనను అధికారులు సుమారు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించి, కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-2024) మద్యం విధానంలో చోటుచేసుకున్న అక్రమాలు, నిధుల మళ్లింపు ఆరోపణలపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలోనే మిథున్ రెడ్డికి సమన్లు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయన ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. మద్యం విధాన రూపకల్పన, డిస్టిలరీలతో సంబంధాలు, నిధుల లావాదేవీల వంటి పలు కీలక అంశాలపై అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది.విచారణ ముగిసిన అనంతరం బయటకు వచ్చిన మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు ఆదేశాలు ఉన్నందున తాను ఎలాంటి వివరాలు వెల్లడించలేనని స్పష్టం చేసి, అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి వెళ్లిపోయారు. గతంలో ఏపీ పోలీస్ సిట్ (సిట్) ఇదే కేసులో మిథున్ రెడ్డిని ఏ5 నిందితుడిగా చేర్చి అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై ఉన్నారు.సఈ కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని గురువారం దాదాపు ఏడు గంటల పాటు విచారించిన మరుసటి రోజే మిథున్ రెడ్డిని విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయసాయి రెడ్డి వాంగ్మూలం ఆధారంగా లభించిన సమాచారంతోనే ఈడీ దర్యాప్తును ముందుకు తీసుకెళుతున్నట్లు తెలుస్తోంది. ఈ వరుస విచారణలతో కేసులో మరిన్ని కీలక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, మరికొందరు ప్రముఖులకు కూడా సమన్లు జారీ చేసే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

## అనధికార లే ఔట్ల రెగ్యులేషన్ గడువు పొడిగింపు

అమరావతి,**జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**అనధికార లేఅవుట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించింది. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ 2025 కింద దరఖాస్తులు చేసుకునేందుకు ఏప్రిల్ 23 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం కింద అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించు కోవాలనుకునే వారు రూ.10,000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇప్పటికే ఎల్‌ఆర్ఎస్?2025 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 61,947 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అనధికార లేఅవుట్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హెచ్చరించారు. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, నిబంధనల ప్రకారం పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోపే దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ శాఖ కోరింది.

## ఉద్యమ కేసులతో ట్యాపింగ్ కేసుకు పోలికా?

(మొదటి పేజీ తరువాయి)

ఆమెను మారుస్తారని తాను అనుకోవట్లేదని చెప్పారు. కవిత కొత్త పార్టీ పెడితే స్వాగతిస్తామన్నారు. కవిత కాంగ్రెస్‌లో చేరనున్నారన్న ప్రచారంపై స్పందిస్తూ.. ఒకవేళ ఆమె వచ్చినా పార్టీలోకి తీసుకోవద్దంటూ అధిష్ఠానానికి తన అభిప్రాయంగా చెప్పినట్లు వెల్లడించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మహేశ్ గౌడ్ చిట్‌చాట్ చేశారు. నిబంధనల ప్రకారం విచారణ జరుగుతుంటే వ్యక్తిత్వ హననం చేస్తున్నారంటూ కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సిట్ విచారణలో ఆయన ప్రమేయం ఉన్నట్లు తేలితే జైలు తప్పదని వ్యాఖ్యానించారు. తోడబుట్టిన చెల్లెలే తన భర్త ఫోన్‌నూ ట్యాప్ చేశారని చెబుతుంటే.. కేటీఆర్, హరీశ్‌రావు దగ్గర్నుంచి సమాధానం లేదన్నారు. సిట్ విచారణకు కవితను, ఆమె భర్తనూ పిలవాలన్నారు.

పదేళ్ల పాలనలో ఆలీబాబా 420 దొంగల మాదిరిగా కేసీఆర్ కుటుంబం దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ అన్నారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే శక్తులకు సంబంధించిన ఫోన్లను మాత్రమే ట్యాప్ చేసేందుకు వీలుంటుందని చెప్పారు. నక్సలైట్లతో సంప్రదింపులు జరుపుతున్నానని ఆరోపిస్తూ తన ఫోన్‌నూ ట్యాప్ చేశారని వెల్లడించారు. కేసీఆర్ కుటుంబంలో తగదాలకు మూలం వాటాల పంపకాల్లో తేడాలేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిలో పారదర్శకత పెరిగిందని తెలిపారు. సిట్ విచారణ లోతుగా జరుగుతున్నందునే జాప్యం జరుగుతోందన్నారు. విచారణ టీవీ సీరియల్‌లాగా కొనసాగుతోందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. కాళేశ్వరం అవినీతికి సంబంధించి కేసీఆర్ కుటుంబంపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని ఆరోపించారు. ఈ నెల 28 నుంచి తాను, మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నట్లు వస్తున్న వార్తలపై వివరాలివ్వాలని స్థానిక నాయకత్వానికి సూచించినట్లు చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఏమీ పాల్పడలేదని స్పష్టం చేశారు.

## నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం మాజీ ఎమ్మెల్యే మెతకు ఆనంద్‌కు స్పీకర్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

నష్ట పరిహారం చెల్లించాలని స్పీకర్ నోటీసుల్లో పేర్కొన్నారు. అలాగే వారం రోజుల్లో బహిరంగంగా తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే చట్టం ప్రకారం.. న్యాయస్థానాల ద్వారా తగు చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మెతుకు ఆనంద్ ఈ ఏడాది జనవరి 14, 19 తేదీల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. తనపై నిరాధార, తప్పుడు, అసత్య, అభూత కల్పనలు, కట్టు కథలతో కూడిన అవినీతి ఆరోపణలతో పాటు చేశారని ధ్వజమెత్తారు. తన వ్యక్తిగత జీవితానికి, గౌరవానికి భంగం కలిగించే విధంగా ఆ వ్యాఖ్యలున్నాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసుల్లో వివరించారు.

# వ్యవసాయం ఓ విజ్ఞానం

(మొదటి పేజీ తరువాయి)

కళాశాలకు శంకుస్థాపన చేశారు .అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కళాశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. 'వ్యవసాయం ఒక విజ్ఞానమని', ఇంతకు పూర్వం దేశంలో జై జవాన్, జై కిసాన్, నినాదం ఉండేదని, ఆ తర్వాత జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం వచ్చిందని,ప్రస్తుతం ఇది జై జవాన్ ,జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ గా మారిందని తెలిపారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రైతులకు రెండు కోట్ల 47



లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రోసీడింగ్స్ ను అందజేశారు. అంతేకాక స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో 89 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యాన్ని పండిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా 85శాతం మందికి ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటీ ,ఏఐ కన్నా వ్యవసాయ రంగమే ముందుంటుందని, సాఫ్ట్ వెర్, ఐటి సెక్టార్ ల నుండి వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేసే రోజులు వస్తాయని అన్నారు. తెలంగాణ దేశానికే వరి అందించే ఏకైక రాష్ట్రం గా మారిందని, వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి జిల్లాలలో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలలో వ్యవసాయ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రెండు కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి తెలంగాణ రైతులు దేశంలోనే ముందున్నారని, అలాగే ఇతర పంటల విషయంలో సైతం రాష్ట్ర రైతులు ముందు నిలుస్తున్నారని, ప్రత్యేకించి ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం పామాయిల్ పంటలో దేశంలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని, ప్రస్తుతం 10 లక్షల ఎకరాలలో పామాయిల్ తోటలు పండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా సన్నబియ్యాన్ని సాగు చేయడంతో పాటు, పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్న ఘనత తమదేనన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి ,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ జానయ్య, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడారు. మెమ్మెల్సీ శంకర్ నాయక్ వందన సమర్పణ చేయగా, పార్లమెంట్ సభ్యులు కుందూర్ రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూర్ జయవీర్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా ఎస్పీ కే. నరసింహ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేరళలో కొత్త రైళ్లకు ప్రధాని మోదీ పచ్చజెండా.

తిరువనంతపురం **జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
ప్రధాని నరేంద్ర మోదీ కేరళలో కొత్త రైల్వే సేవలకు ఈరోజు పచ్చజెండా ఊపారు. తిరువనంతపురం నుంచి మూడు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఒక ప్యాసింజర్ రైలును ఆయన ప్రారంభించారు. దేశంలో రైల్వే కనెక్టివిటీని ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా ఈ కొత్త సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు.

కొత్తగా ప్రారంభించిన వాటిలో తిరువనంతపురం-చర్లపల్లి, నాగర్‌కోయిల్-మంగళూరు, తిరువనంతపురం-తాంబరం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీటితో పాటు త్రిస్సూర్-గురువాయూర్ మధ్య కొత్త ప్యాసింజర్ రైలును కూడా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఈ రైళ్లు తమ గమ్యస్థానాలకు బయలుదేరాయి. ఈ నాలుగు సర్వీసులను దక్షిణ రైల్వే నిర్వహించనుంది. తిరువనంతపురం-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రయాణిస్తుంది. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చనుంది. అలాగే, తిరువనంతపురం-తాంబరం రైలు తమిళనాడులోని పారిశ్రామిక, విద్యా కేంద్రాలకు అనుసంధానంగా ఉంటుంది.

అమృత్ భారత్ రైళ్లను సామాన్యులకు తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలు అందించేలా రూపొందించారు. ఇవి నాన్-ఏసీ రైళ్లు అయినప్పటికీ, వీటిలో ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీటుకు ఫోన్ చార్జర్ సాకెట్, బాటిల్ హోల్డర్ వంటి వసతులు కల్పించారు. కోచ్‌లు విశాలంగా, సౌకర్యవంతంగా ఉన్నాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయ రైళ్లకు, ప్రీమియం రైళ్లకు



మధ్య అంతరాన్ని తగ్గించి, తక్కువ ఛార్జీలతో మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించడమే ఈ రైళ్ల లక్ష్యమని రైల్వే అధికారులు తెలిపారు.

### ఇక తమిళనాడు ఎన్‌డీఏతోనే: తమిళనాడు, కేరళలో ప్రచారానికి ప్రధాని శ్రీకారం

దక్షిణాదిన ఇంతవరకు బీజేపీని ఆదరించని తమిళనాడు, కేరళల్లో ప్రధాని మోదీ శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పాలక పార్టీలు/కూటములపై విరుచుకుపడ్డారు. ప్రధానంగా తమిళనాడులో డీఎంకే టైమైపోయిందన్నారు. అవినీతి డీఎంకే ప్రభుత్వానికి వీడ్కోలు పలకాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించేశారని తెలిపారు. ఇక తమిళనాడు ఎన్‌డీఏతోనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. చెన్నై సమీపంలోని మదురాంతకంలో జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'డీఎంకే ప్రభుత్వ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఇది అవినీతి, మాఫియా, నేరాల (కరప్షన్-మాఫియా-క్రైం(సీఎంసీ) సర్కారు. అది ఒక కుటుంబాన్ని మాత్రమే సేవిస్తోంది. ఈ పార్టీలో ఎదగాలంటే.. వారసత్వం, అవినీతి, మహిళలపై అసభ్య వ్యాఖ్యలు, భారత సంస్కృతిని తూలనాడడం.. ఇవే మార్గాలు' అని ధ్వజమెత్తారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పేరు ప్రస్తావించకుండా ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంతో చేసిందని ప్రధాని అన్నారు. 2014కి ముందు కేంద్ర ప్రభుత్వంలో కాంగ్రెస్, డీఎంకే భాగస్వాములుగా ఉన్నప్పుడు విడుదలైన నిధుల కంటే 3 రెట్ల నిధులను తన ప్రభుత్వం తమిళనాడుకు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఎంత అవినీతి జరుగుతోందో, ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి చేరుతోందో చిన్నపిల్లలకు కూడా తెలుసన్నారు. స్టాలిన్ జమానాలో డ్రగ్స్, మద్యం మాఫియా మాత్రమే పురోగతి సాధించాయని చెప్పారు. రాష్ట్ర ప్రజలు డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మిత్రపక్షం అన్నాడీఎంకే అధినాయకురాలు, దివంగత మాజీ సీఎం జయలలితను ప్రశంసించారు. ఆమె హయాంలో శాంతిభద్రతలు భేషుగ్గా ఉండేవని.. మహిళలకు సంపూర్ణ రక్షణ ఉండేదని తెలిపారు. మదురైలో తిరుప్పన్‌కుండ్రం కొండపై దీపోత్సవానికి సంబంధించిన వివాదాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. భక్తులకు బీజేపీ మద్దతుగా నిలువగా.. డీఎంకే మాత్రం ఓటుబ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమిచ్చిందని విమర్శించారు. ఈ సభలో అన్నాడీఎంకే అధినేత పళనిసామి, ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్, పీఎంకే అధినేత అన్బుమణి రామ్‌దాస్ తదితర మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు.

# ఏడు గంటలు కేటీఆర్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

దాంతో పెద్ద ఎత్తున పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ రోడ్డు మీదనే బైఠాయించారు. ఏసీపీ కార్యాలయంలోకి ప్రవేశించిన కేటీఆర్‌ను అప్పటికే వేచి ఉన్న సిట్ అధికారులు ఆయనను ప్రత్యేక గదిలో కూర్చోబెట్టి కొద్ది సేపటి తర్వాత ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ విచారణలో డీసీపీలు రితురాజ్, నారాయణ్‌రావు, ఏసీపీలు వెంకటగిరి, శ్రీధర్ తదితరులు పాల్గొనగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ముఖ్యంగా రూ.12 కోట్లు విలువ చేసే ఎలక్టోరల్ బాండ్స్‌ను సంధ్య శ్రీధర్ నుంచి అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి మీరు వసూలు చేసింది నిజమేనా? అంటూ ప్రశ్నల వర్షాన్ని సిట్ అధికారులు ప్రారంభించినట్టు తెలిసింది. ఈ విధంగా ఎన్ని కోట్ల రూపాయలను ఎలక్టోరల్ బాండ్స్ పేరిట సేకరించారు, అందుకు మీరు ఎస్ఐబీకి చెందిన కొందరు అధికారుల సహకారాన్ని తీసుకున్న మాట నిజమేనా అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం.

అలాగే సిరిసిల్లలో ఫోన్‌ట్యాపింగ్ వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి కొన్ని ఫార్మాస్యూటికల్ కంపెనీలు, మరికొందరు వ్యాపారవేత్తలు, సినీ సెలెబ్రిటీల ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడింది నిజమేనా అని కూడా సిట్



ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఏయే సినీనటులు నేను బెదిరించినట్టు మీకు ఫిర్యాదు చేశారని కేటీఆర్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. అందుకు మా ప్రశ్నలు అవునా, కాదా అని సమాధానమివ్వండని సిట్ అధికారులు కేటీఆర్‌ను అడిగినట్టు తెలిసింది. అదే సమయంలో, రాధాకిషన్‌రావుకు మీరు కొన్ని ఫోన్ నెంబర్లను పంపించి ట్యాపింగ్ చేయాలని చెప్పారట కదా అనే ప్రశ్నకు.. అలా చెప్పినట్టు ఆయన చెప్పారా అంటూ కేటీఆర్ ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. కాగా పోలీసు అధికారులతో నాకు సంబంధమేమిటని కేటీఆర్ ప్రశ్నించగా.. మరి రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావులకు పలుమార్లు మీరు ఫోన్ చేసినట్టుగా ఉంది కదా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. అదే సమయంలో ఒక అధికారి కేటీఆర్ ముందు కొందరి పేర్ల జాబితాను ఉంచి వీరంతా మీకు తెలుసా అని ప్రశ్నించగా.. రాజకీయ నాయకుడిగా చాలా మంది కలుస్తారు, మాట్లాడుతారు అందరినీ గుర్తు పెట్టుకోలేం కదా అని ఆయన సమాధానమిచ్చినట్టు సమాచారం.

మధ్యాహ్నం 2-3 గంటల వరకు భోజన విరామం ఇచ్చాక.. సాయంత్రం 6.15 గంటల వరకు కేటీఆర్‌కు పలు ప్రశ్నలను సిట్ అధికారులు సంధించినట్టు తెలిసింది. కొన్నింటికి సమాధానమిచ్చిన కేటీఆర్ మరికొన్ని ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు వేస్తూ పోయారని సమాచారం. మొత్తమ్మీద ఏడు గంటలకు పైగా కేటీఆర్‌ను విచారించిన సిట్ అధికారులు.. ఆ సమాచారాన్ని పూర్తిగా రికార్డు చేసినట్టు తెలిసింది. చివరగా విచారణ కొనసాగుతున్నదనీ, అవసరమైతే మరోసారి పిలుస్తామని సిట్ అధికారులు కేటీఆర్‌కు తెలిపి పంపించివేశారని సమాచారం. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చిన కేటీఆర్‌ను చూసి, బయట వేచి ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున 'కేటీఆర్ జిందాబాద్', 'పోలీస్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. వారి నినాదాల మధ్య కారెక్కిన కేటీఆర్.. తన కాన్వాయ్ తో వెళ్లారు.

కేటీఆర్ విచారణ సాగుతున్నంత సేపు పలు మార్లు బీఆర్ఎస్ కార్యకర్తలు తోసుకొని ముందుకు రావడం, వారిని పోలీసులు వెనక్కి నెట్టేయడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి అక్కడ నెలకొన్నది.

## డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు తెలిపింది. అయితే ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదికలు వెల్లడించాయి. ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి తప్పుకుంటున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ.. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియమమేమీ లేదన్నారు.

## జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా
# ప్రజలను చైతన్యపరచాలి.
-తహశీల్దార్ నాగరాజు.



**బయ్యారం/జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
మండల కేంద్రంలోని జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల తహశీల్దార్ కార్యాలయంలో,ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞను మండల తహశీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులతో చేపించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ నా దేశం - నా ఓటు అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవేంద్ర చారి,ఆర్ఐలు సందీప్,ఉపేందర్,బిఎల్ఓ లు,జిపిఓ లు,కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం,విద్యారిని విద్యార్థులు,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల 2026 డైరీ ఆవిష్కరణ



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జనవరి 23 (జర్నలిస్ట్ వార్త);** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన జర్నలిస్టుల 2026 డైరీని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం ఆవిష్కరించారు. హనుమకొండ సుబేదారిలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, ప్రభుత్వానికిప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల డైరీ ఆవిష్కరణలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో యూనియన్ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ. వేణుమాధవ్, కంకనాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షులు ఉట్కూరి సాయిరాం, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, ఎంఏ. నయీం, జిల్లా కార్యవర్గ సభ్యులు పులికంటి రాజేందర్, అల్లె రామారావు, ఎంఎ. వాజీద్, తాళ్ల రవి, ఎండి. ఖాదర్ పాషా, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా ఇంచార్జిగా తాటికాయల వివేకానంద నియామకం



**వర్ధన్నపేట/జనవరి23 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా ఇంచార్జిగా వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామానికి చెందిన తాటికాయల వివేకానంద ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య స్వయంగా వివేకానందకు అందజేశారు.
తాటికాయల వివేకానంద గతంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా, జిల్లా కన్వీనర్‌గా వివిధ బాధ్యతలు నిర్వర్తించి సంఘ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. వరంగల్ జిల్లాలో తెలంగాణ అంబేద్కర్ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆయనను జిల్లా ఇంచార్జిగా నియమించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా కో-కన్వీనర్ జెంగిలి భాస్కర్, వర్ధన్నపేట మండల నాయకులు తుల్లా అనీల్, మరుపట్ల రమేష్, బోయిని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడవ వార్డ్ లో పోటీకి సిద్ధంగా దొంతే బోయిన నితీష్ కుమార్

**వైరా/జనవరి 23(జర్నలిస్ట్ వార్త);** మున్సిపాలిటీ ఎన్నికల్లో మూడవ వార్డు జనరల్ స్థానం నుంచి (ఇండిపెండెంట్) గా పోటీకి సిద్ధమవుతున్న యువజన కాంగ్రెస్ వైరా నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ దొంతే బోయిన నితీష్ కుమార్ (సన్నీ యాదవ్) యాదవ సామాజిక వర్గం చెందిన యువ నాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి మరియు జగన్ వీరాభిమాని వైరా మున్సిపాలిటీ మూడో వార్డు లో సన్నీ యాదవ్ స్థానికంగా మంచి ఆదరణ కలదు అదేవిధంగా స్థానికంగా ఈ వార్డులో వైయస్సార్ అభిమానులు ఎక్కువ , స్థానికంగా యాదవ సామాజిక వర్గ ఓటర్లు కూడా ఉండటం గమనార్ధం ఈ యొక్క వార్డులో జనరల్ కావడం తెరమీదకు దంతే బోయిన సన్నీ యాదవ్ పోటీకి సిద్ధమవుతున్నారు



# దళిత నియోజకవర్గంలో దొరల పెత్తనం ఏంటి?
## వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

**వర్ధన్నపేట/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**
ఎస్సీ రిజర్వుడు అయిన వర్ధన్నపేట నియోజకవర్గంలో దళితులకు ప్రాధాన్యత ఇవ్వకుండా, వెలమ వర్గానికి చెందిన వ్యక్తిని నియోజకవర్గ ఇంచార్జీగా నియమించడం దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యగా వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తీవ్రంగా విమర్శించారు. వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. వర్ధన్నపేట ఒక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. అలాంటప్పుడు ఇక్కడ ఒక దళితునికే నియోజకవర్గ ఇంచార్జీ బాధ్యతలు ఇవ్వాలి. కానీ దయాకర్ రావు అనే వెలమ దొరను నియమించడం మీ కులపిచ్చికి నిదర్శనం కాదా? అని నిలదీశారు.



అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా ఉన్న దయాకర్ రావు ఈ నియోజకవర్గానికి ఏమీ చేయలేదని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి ప్రజలను ప్రలోభపెడుతూ రాజకీయ గారడీలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చెప్పుకుంటూ నియోజకవర్గ ఇంచార్జీగా తిరుగుతున్నారు. కానీ వర్ధన్నపేటకు మీ వల్ల జరిగిన మేలు ఏమిటి? అని ప్రశ్నించారు. మరోవైపు ప్రస్తుత ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని తెలిపారు.
ఎమ్మెల్యేగా గెలిచిన మొదటి ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి రూ.10 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు, రెండో ఏడాదిలో రూ.5 కోట్లు తీసుకొచ్చారని గుర్తుచేశారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, మున్సిఫ్ కోర్టు మంజూరు, వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులతో పనుల ప్రారంభం జరగడం ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఘనతేనన్నారు. ఇది ముమ్మాటికీ ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. అలాంటప్పుడు మా దళిత నియోజకవర్గంలో దొరల పెత్తనం ఎందుకు? అని నరుకుడు వెంకటయ్య ప్రశ్నించారు.
ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తుళ్ల రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిధుముళ్ల భాస్కర్, జిల్లా నాయకుడు మరుపట్ల సాయికుమార్, మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి. అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## మచ్చలేని నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావుపై
# నిందలు చేస్తే ఖబర్దార్ : టీఆర్ఎస్ హెచ్చరిక

**వర్ధన్నపేట/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఇంచార్జ్ చింతల యాదగిరి, పోలపల్లి రామ్మూర్తి, పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షులు తుళ్ల కుమారస్వామి మాట్లాడుతూ ఎర్రబెల్లి దయాకర్‌రావు మచ్చలేని నాయకుడని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో మూడు పర్యాయాలు, పాలకుర్తిలో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ప్రజలకు సేవలందించిన నాయకుడు దయాకర్‌రావు ని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ విప్పుగా, టీఆర్ఎస్ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ మంత్రిగా బాధ్యతలు



నిర్వర్తించి రాష్ట్రాన్ని దేశంలోనే ముందువరుసలో నిలిపారని, అనేక జాతీయ అవార్డులు సాధించారని పేర్కొన్నారు. అన్న అంటే నేనున్నా అన్నట్టుగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే వ్యక్తి దయాకర్‌రావు ని అన్నారు. వర్ధన్నపేట, పాలకుర్తి నియోజకవర్గాలను అభివృద్ధిలో ముందుంచిన నాయకుడు ఆయనేనని చెప్పారు. 24ఐ7 ప్రజల కోసం అందుబాటులో ఉండే నాయకుడని కొనియాడారు. కనీస అర్హత లేని వ్యక్తులు దయాకర్‌రావు ని విమర్శించే స్థాయిలో లేరని, 70 ఏళ్ల వయస్సులోనూ పాలకుర్తి, వర్ధన్నపేట ప్రాంతాల్లో నిరంతరం పర్యటిస్తూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని తెలిపారు. అలాంటి నాయకుడిపై అనవసర ఆరోపణలు చేస్తే వర్ధన్నపేటలో కార్యకర్తలే కాదు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో మార్గం బిక్షపతి, అన్నమనేని అప్పారావు, గుజ్జా గోపాలరావు, తుమ్మల యాకయ్య, సిల్వర్ కుమార్ స్వామి, బుక్య భిక్షపతి, కొండేటి శ్రీనివాస్, పూజారి రఘు, మర్త సారంగపాణి, కంజర్ల రవీందర్, వేణుగోపాల్ రావు, పిట్టల రాజు, భూక్య రామన్న, భానోతు శ్రీను, జన్ను రాములు, కొండేటి సుధాకర్, కంజర్ల మహేష్, పులి సత్యనారాయణ, ఎండి అజీమ్, సిల్వర్ రాజు, వేరేష్ మో తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో మేడారం జాతర సక్సెస్ చేయాలి
## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశం

**ధర్మసాగర్ /జనవరి హనుమకొండ బ్యూరో23 (జర్నలిస్ట్ వార్త):**
మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న మేడారం సమ్మక్కసారలమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్, ఆర్టీసీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్, ఆర్టీసీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.
గత జాతర సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలు, కారణాలపై సమీక్షించి ఈసారి అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ చేపట్టిన ఏర్పాట్లను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు గమనిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మేడారం వెళ్లే మార్గాల్లో బస్సులు నిలిపి టికెట్లు జారీ చేయరాదని,




గతంలో సమస్యలు సృష్టించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోకూడదని ఆదేశించారు. డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.
బస్సులు బ్రేక్‌డౌన్ అయిన వెంటనే మరమ్మత్తులు చేపట్టేలా టెక్నీషియన్లు అందుబాటులో ఉండే విధంగా క్యాంపులు ఏర్పాటు చేయాలని, రోడ్లపై బస్సులు నిలిపివేయకుండా చూడాలని సూచించారు. బస్టాండ్ నుంచి బయలుదేరిన బస్సులు మధ్యలో ఆగకుండా నేరుగా మేడారం బస్టాండ్‌లోనే ఆగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భక్తులు కాలకృత్యాలు, తినుబండారాలు ముందే ఏర్పాట్లు చేసుకునేలా బస్టాండ్‌లలో విస్తృత ప్రచారం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.
హనుమకొండ బాలసముద్రం నుంచి జాతరకు వెళ్లే బస్సులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నగరంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బస్సులను తరలించేలా ఏర్పాట్లు చేయాలని ట్రాఫిక్ అధికారులకు సీపీ ఆదేశించారు.
ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు భాను కిరణ్, మహేష్, డిపో మేనేజర్లు రవిచందర్, అర్పిత, ధర్మాసింగ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సీతారెడ్డి, వెంకన్న, సుజాతతో పాటు పోలీస్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ ఏబీఎన్ రాధాకృష్ణ
## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తాళ్ల వెంకటేశ్వర్లు

**తల్లాడ/జనవరి23(జర్నలిస్ట్ వార్త);** మచ్చలేని రాజకీయ నాయకుడు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క దళిత సామాజిక వర్గానికి చెందిన వారిని కావాలని ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో దుష్ప్రచారం చేస్తున్నారు .దాదాపుగా 40 సంవత్సరాల నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల మన్యలు పొందుతూ ప్రజల కోసమే బ్రతుకుతూ ఆయన చేస్తున్నటువంటి మంచి పనులు కి ఓర్వలేక కొంతమంది కావాలని బదనాం చేయడానికి కట్టుకథలు అల్లుతున్నారు ఈ కట్టు కథలను నమ్మే పరిస్థితిలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు లేరు అని ఆయన ముక్తకంఠంతో తెలియజేశారు తెలంగాణ రాష్ట్రంలో బలహీనపడినటువంటి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలబెట్టాలని ఆయన ప్రయత్నాన్ని ఆపడానికి కొంతమంది శక్తులు ఇలాంటి వాటికి పాల్పడుతున్నారు అని చెప్పారు బలహీనవర్గాల నేత బట్టి విక్రమార్క పై మీరు దొర అహంకారంతో కావాలని పని కట్టుకొని ఇష్టానుసారంగా నిరాదరమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు అని వెంకటేశ్వర్లు అన్నారు. అదేవిధంగా దీనిపై రాధాకృష్ణ బెషరతుగా మా బట్టి విక్రమార్క కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు



## మట్టమ్మ హోటల్ నిర్వాకురాలు ను కలిసిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్



**తల్లాడ/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త);** రింగ్ రోడ్డు పరిధిలోమట్టమ్మహోటల్ నిర్వాహకురాలు సరికొండ.రవణమ్మను కల్లూర్ ఏసిపి వైరా ఇంచార్జ్ వసుంధర యాదవ్.పలకరిం చారు .తదనంతరం రవణమ్మ ఆరోగ్యం, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తల్లాడ మండలంలోని తమరి హోటల్లో భోజనం చాలా రుచిగా ఉంటుందని ప్రయాణికులు, బాటసారులు పలు సందర్భాల్లో నెమరు వేసుకొంటునారని గుర్తు చేస్తారు. ఈ రెండు తెలుగు రాష్ట్రాల్లో మీ యొక్క హోటల్ కి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని కొని ఆడారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



## బీజేపీ పార్టీలో చేరిన నామాలపాడు వార్డు సభ్యుడు చీమల కృష్ణ.



**బయ్యారం/జనవరి 23(జర్నలిస్ట్ వార్త);**
భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనకు ఆకర్షితులై నామాలపాడు వార్డు సభ్యులు బీజేపిలో చేరారు. బయ్యారం మండలం నామాలపాడు గ్రామపంచాయతికి చెందిన 5వ వార్డు సభ్యులు చీమల కృష్ణ శుక్రవారం బీజేపీ మండల కార్యదర్శులు తుమ్మల శ్రీనివాస్, ఊకె రామ్మూర్తి ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. వీరికి ఊకె రామ్మూర్తి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అడపు జై, దాసరి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటకు అదనపు వ్యవసాయ పనిముట్లు మంజూరు



**వర్ధన్నపేట/జనవరి23 (జర్నలిస్ట్ వార్త):**
202526 ఆర్థిక సంవత్సరానికి గాను వర్ధన్నపేట మండలానికి వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమం కింద అదనపు వ్యవసాయ పనిముట్లు మంజూరయ్యాయి. ఈ పథకం ద్వారా మండలంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమం కింద రోటవేటర్లు 10, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లులు 2, డిస్క్ హారోలు 13, బండ్ ఫార్మర్ 1 యూనిట్‌ను కేటాయించినట్లు పేర్కొన్నారు. రోటవేటర్లలో జనరల్‌కు 7, ఎస్సీకి 2, ఎస్టీకి 1 యూనిట్‌లను, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లుల్లో జనరల్‌కు 1, ఎస్సీకి 1 యూనిట్‌ను కేటాయించారు. అలాగే డిస్క్ హారోలలో జనరల్‌కు 11, ఎస్సీకి 1, ఎస్టీకి 1 యూనిట్‌లు, బండ్ ఫార్మర్‌ను ఎస్సీ వర్గానికి కేటాయించినట్లు తెలిపారు.
**సబ్సిడీ వివరాలు ఇలా ఉన్నాయి:**
5 ఎకరాల లోపు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు, మహిళా రైతులు, అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తించనుంది. ఇతర అర్హులైన రైతులకు 40 శాతం సబ్సిడీ అందజేయనున్నారు.
ఆసక్తి గల రైతులు దరఖాస్తు ఫారమ్‌ను పూర్తిగా నింపి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్‌తో పాటు (ట్రాక్టర్ ఆర్‌సీలో "వ్యవసాయ పనుల కోసం" అని నమోదు అయి ఉండాలి) ఐదు రోజులలోపు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.
ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో విజయ్ కుమార్ తెలిపారు

## జాతీయ రహదారి రోడ్డు భద్రత మహోత్సవాల్లో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**వైరా/జనవరి 22 (జర్నలిస్ట్ వార్త):** వైరా స్థానిక మండలంలో నిర్వహించిన జాతీయ రహదారి రోడ్డు భద్రత మహోత్సవాల్లో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి అని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, రహదారి భద్రతపై నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రజల్లో అవగాహన పెరగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు, రాజకీయ నాయకులు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేశారు. న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ డైరెక్టర్ పోతినేని భూమేష్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే బెదిరింపులను నమ్మొద్దు

### తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు సూచన -ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం





**భీమదేవరపల్లి/జనవరి23 (జర్నలిస్ట్ వార్త):** కరీంనగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఆదేశాలతో నాబార్డ్ ఆర్థిక సహకారంతో వంగర తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలంలోని రంగయ్యపల్లి, రత్నగిరి గ్రామాల్లో రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ కళాజాత బృందం నాటికలు, జానపద గీతాలు, మ్యాజిక్ షోల ద్వారా ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై చైతన్యం కల్పించారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పథకాలు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన రూ.436, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన రూ.20, అటల్ పెన్షన్ యోజన ప్రాముఖ్యతను కళాకారులు వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం ఉద్దేశించిన ఎన్ పిఎస్ వాత్సల్య, ఎస్ బిఐ జనరల్ ఇన్సూరెన్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ అధికారులు సూచించారు. ముఖ్యంగా ఎవరికీ ఓటీపీలు చెప్పకూడదని తెలిపారు. డిజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే బెదిరింపులను నమ్మవద్దన్నారు. తెలియని వ్యక్తులు పంపే బ్లూ రంగు లింకులు, ఏపీకె ఫైల్స్ క్లిక్ చేయవద్దని తెలిపారు. అనధికారిక ఆన్‌లైన్ లోన్ యాప్‌లను డౌన్లోడ్ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగర తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటరావు, ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, రంగయ్య పల్లి గ్రామ సర్పంచ్ రజిని మహేష్, రత్నగిరి సర్పంచ్ వంగ తిరుమల సురేష్, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పినపాక డాన్ బోస్కో పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహణ



**తల్లాడ/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని పినపాక గ్రామంలో ఉన్న డాన్ బోస్కో పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి దేవి పూజా వేడుకలు భక్తి శ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫాదర్ నిరీక్షణ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్ ఫాదర్ వై. ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, విద్యకు ప్రతీక అయిన సరస్వతి దేవి ఆశీస్సులు విద్యార్థుల జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సరస్వతి దేవిని చదువుల తల్లిగా, మల్లెపువ్వులా సువాసనతో, పున్నమి చంద్రునిలా ప్రకాశంతో, శ్వేత వస్త్రధారిణిగా, శ్వేత పద్మాసీనురాలిగా వర్ణిస్తూ సకల విద్యలకు ఆమె అధిష్ఠాత్రి దేవత అని వివరించారు. అనంతరం సరస్వతి దేవి చిత్రపటానికి ముఖ్య అతిథి ఫాదర్ నిరీక్షణ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు తదితరులు సంప్రదాయ పద్ధతిలో కొబ్బరికాయలు సమర్పించి దేవి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సరస్వతి దేవి శ్లోకాలను పాడించి, విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు కూడా అవసరమని ముఖ్య అతిథులు తమ సందేశంలో తెలిపారు. అనంతరం విద్యార్థులందరూ సరస్వతి దేవికి తమ విన్నపాలను సమర్పించారు. చివరగా జాతీయగీతంతో కార్యక్రమాన్ని ముగించగా, ఈ శుభ సందర్భంగా విద్యార్థులందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

## కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

### జాతర బ్రహ్మోత్సవాలలో ఆలయ ఆదాయం రూ.58,28,681





**భీమదేవరపల్లి/జనవరి23 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం జాతర బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకులు జి.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో హుండీలను తెరిచారు. హుండీలో నోట్లు రూ 24,74,476 నాణెలు రూ 2,03,705 మొత్తం రూ26,78,181 ఆలయ హుండీ ద్వారా సమకూరినట్లు ఇవో పి.కిషన్ రావు తెలిపారు. ఈ జాతర బ్రహ్మోత్సవాల్లో వివిధ టెండర్ల ద్వారా రూ.31,50,500 రాగా జాతర సందర్భంగా రూ 58,28,681 వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయం దేవస్థానం యూనియన్ బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. హనుమకొండ శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి, కొత్తకొండ శ్రీ సరస్వతి సేవాసమితి సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ముల్కనూర్ పోలీస్ సిబ్బంది, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

## స్టేషన్ ఘనపూర్‌లో ఘనంగా నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు



**ధర్మసాగర్ హనుమకొండ /జనవరి23 (జర్నలిస్ట్ వార్త):**
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ & విద్యాశాఖ మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ బాబు జన్మదినాన్ని శుక్రవారం నాడు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భైరపాక ప్రభాకర్, బత్తిని ఎల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నారా లోకేష్ బాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులుమాట్లాడుతూ, ఐటీ , విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తీసుకుంటున్న సంస్కరణలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. ముఖ్యంగా విద్యారంగంలో ఆధునికీకరణ, డిజిటల్ సాంకేతికతను ప్రభుత్వ సేవలకు అనుసంధానం చేయడంలో ఆయన చేస్తున్న కృషి యువతకు ఆశాజ్యోతి లాంటిదని పేర్కొన్నారు. యువతను రాజకీయాల్లోకి ఆకర్షిస్తూ, నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానంతో పాలనలో పారదర్శకత తీసుకువచ్చిన నాయకుడిగా నారా లోకేష్ బాబు ప్రత్యేక గుర్తింపు సాధించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల సందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ అనంతరం మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ జెండాలతో నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చదువు మనిషిని సన్మార్గంలో నడిపించాలి

### ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు

### విశ్వశాంతి విద్యాలయంలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

### చిన్నారులకు అక్షరాభ్యాసం ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు









**సత్తుపల్లి / జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**
సకల విద్యలకు అధిష్ఠాత్రి అయిన సరస్వతీ దేవి అనుగ్రహంతో విద్యార్థుల జీవితాల్లో జ్ఞానం, విజ్ఞానం, కళలు వికసించాలని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు ఆకాంక్షించారు.
శుక్రవారం సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో వసంత పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
జ్ఞానం మనిషిలో వినయాన్ని పెంపొందించి అహంకారాన్ని దూరం చేస్తుంది. వినయం మంచి ఆచరణకు దారి చూపుతుంది. చదువు కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, మనిషిని సన్మార్గంలో నడిపించే ఆయుధంగా ఉండాలి" అని పేర్కొన్నారు. వసంత పంచమి సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పండితులు సరస్వతీ దేవి మహిమ, విద్య ప్రాముఖ్యత, అక్షరాభ్యాసం యొక్క ఆధ్యాత్మిక విశిష్టతను విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ పవిత్ర రోజున అక్షరాభ్యాసం చేస్తే పిల్లలకు విద్యాభివృద్ధి కలుగుతుందన్న నమ్మకంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులతో కలిసి పాఠశాలకు వచ్చి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు.
అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సరస్వతీ దేవి గొప్పతనాన్ని కీర్తిస్తూ విశ్వశాంతి విద్యాలయ చిన్నారులు ఆరాధ్య, వేద్య, అద్వైక, ప్రవళిక, దర్శినిలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాల్లోని భావవ్యక్తీకరణ, నైపుణ్యం హాజరైన వారిని మంత్రముగ్ధులను చేశాయి.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వసంత పంచమి వేడుకలు విద్యార్థుల్లో విద్యాపై భక్తి, సంస్కృతి పట్ల గౌరవం, నైతిక విలువలను పెంపొందించాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

## బాధిత కుటుంబాలకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శ



**రాయపర్తి/జనవరి 23(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మైలారం గ్రామ మాజీ సర్పంచ్ లేతాకుల యాదవ రెడ్డి తల్లి లేతాకుల వెంకటమ్మ, దుబ్బ తండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు దేధావత్ విజయ్ తల్లి దేదావత్ నర్సమ్మ, కొండాపురం గ్రామానికి చెందిన బండారి జంపయ్య, గోగుల దయాకర్ ఇటీవల మరణించగా శుక్రవారం బాధిత కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ నాయకులు లేతాకుల రంగా రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, పెరటి యాదవ రెడ్డి, గబ్బేట కొమురయ్య, జయపాల్ రెడ్డి, పెండ్లి మల్లారెడ్డి, ఐత రవి తదితరులు పాల్గొన్నారు.

# పొలాల్లో భయాందోళనలు

## చాకచక్యంతో మొసలిని పట్టుకున్న అటవీ సిబ్బంది



**నర్సంపేట/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**నర్సంపేట మండలం ముగ్ధంపురం గ్రామ పరిధిలోని చెరువు సమీపంలోని పొలాల్లో మొసలి సంచరిస్తుండటంతో రైతుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పొలాలకు వెళ్లేందుకు కూడా రైతులు వెనకాడే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందగానే అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సరిత, బీట్ ఆఫీసర్ యోగేష్‌తో పాటు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పూర్తి అప్రమత్తతతో సహాయక చర్యలు చేపట్టి, ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా మొసలిని చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దానిని సురక్షిత అటవీ ప్రాంతానికి తరలించి వదిలివేశారు.అటవీశాఖ సిబ్బంది సమయస్ఫూర్తితో చేపట్టిన చర్యలతో గ్రామంలో నెలకొన్న భయాందోళనలు పూర్తిగా తొలగిపోయాయి. ఈ సందర్భంగా ముగ్ధంపురం గ్రామ రైతులు అటవీశాఖ అధికారుల ధైర్యసాహసాలను, పనితీరును ప్రశంసించారు.

## పేదింటి ఆడబిడ్డలకు వరప్రదాయిని

# కళ్యాణ లక్ష్మి పథకం అమలు



**నర్సంపేట/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**ప్రజా ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేష దృష్టి సారిస్తోందని నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు.శుక్రవారం నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ క్లబ్‌లో 7 మండలాలకు చెందిన 305 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సాయంతో మొత్తం రూ. 3 కోట్ల 5 లక్షల విలువైన ఆర్థిక సహాయం పేదింటి యువతి పెళ్లి ఖర్చుకు అందజేయబడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి, పేద ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం మా ప్రభుత్వ బాధ్యత. 'కళ్యాణ లక్ష్మి' పథకం ద్వారా చెక్కులను ఎటువంటి దళారులకు ఇవ్వకుండా, నేరుగా పొందగలిగేలా చూడడం ముఖ్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో పోలం ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు



**తల్లాడ/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఐటీవిద్యాశాఖ మంత్రి, యువ నాయకుడు నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు తల్లాడ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి లోకేష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు, బాటసారులకు కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని రామయ్య, కూచిపూడి వెంకటేశ్వరరావు, నున్న తారక రామారావు, ధూపాటి భద్రరాజు, బిల్లుపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు నారపోగు ప్రసాద్, బాబు తాత రాజు, భాస్కరాచారి, మూకర దోనేష్, గరిక వెంకటేశ్వర్లు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నారా లోకేష్ బాబు యువతకు ఆదర్శంగా నిలుస్తూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## సమ్మక్క సారలమ్మకు ఎత్తు

## బంగారం సమర్పించిన దుబ్బాక వినయ్



**స్టేషన్ ఘన్ పూర్/ జనవరి 23 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ఘన్పూర్ మండలంలోని తాటికొండ గ్రామం లో ఎస్బిఐ సేవ కేంద్రం ఇంచార్జి దుబ్బాక వినయ్ దంపతులకూతురైన దుబ్బాక జియాన్షిక యొక్కా సమ్మక్క సారలమ్మలకు శుక్రవారం ఎత్తు బంగారం సమర్పించడంజరిగింది. ఈసందర్భంగా జియాన్షిక నిలువెత్తు బంగారం ( బెల్లం) కొనుగోలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని,పాడి పంటలకు అభివృద్ధి చెందాలనిఅమ్మవారికిబంగారం (బెల్లం) సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో కొత్త సర్పంచుల ఘన సన్మానం

## తహసిల్దార్‌నుశాలువతో ఆహ్వానించి అభినందనలు తెలిపారు





**తల్లాడ/జనవరి 23(జర్నలిస్ట్ వార్త);** మండల కేంద్రం నూతన సర్పంచులతో కళకళలాడింది. బిల్లుపాడు, రామచంద్రాపురం, కొత్త వెంకటగిరి, వెంగన్నపేట, మిట్టపల్లి, కుర్నవల్లి గ్రామాల ప్రతినిధులు తహసిల్దార్‌ను ఘనంగా సత్కరించారు. ప్రతీ సర్పంచు తన గ్రామం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రత్యేక చొరవ చూపాలని అధికారులకు కోరుతూ, శాలువ్లతో మర్యాదగా ఆహ్వానించారు.
సర్పంచులు ప్రధానంగా త్రాగునీరు, రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి ప్రధాన సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి కొత్త ఊపును నింపినట్లు తెలుస్తోంది.
కార్యక్రమంలో దీవెల్. వెంకటేశ్వరరావు, వెన్నిక. కృష్ణవేణ్, పోట్రు. స్వప్న, బోడ. మౌనిక, తోట. రామారావు, ఎక్కిరాల శేషమ్మ, ఉపసర్పంచులు, అలాగే జక్కంపూడి. కృష్ణమూర్తి తనయుడు కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత వారోత్సవాల్లో ప్రతిజ్ఞా మానవహారం

## ప్రమాదాల నివారణపై ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపు





**వైరా/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**
రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు వైరా నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా ప్రతిజ్ఞా మానవహారం నిర్వహించారు. వైరా రింగ్ రోడ్డు సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడమే ప్రమాదాల నివారణకు మార్గమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు అందజేయగా, వాహనదారులకు గులాబి పూలు అందించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం వైరా రింగ్ రోడ్డు సెంటర్‌లో భారీగా మానవహారం చేపట్టారు.
అలాగే తల్లాడ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఏసీపీ వసుంధర యాదవ్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ జయపాల్ శీలం వెంకట నర్సిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మూళ్ళపాటి సీతారాములు, టౌన్ అధ్యక్షులు ఏదునూరు సీతారాములు, కొణిజర్ల మండల అధ్యక్షులు సూరంపల్లి రామారావు, కట్ల సంతోష్, పమ్మి అశోక్, కట్ల నాగరాజు, మిట్టపల్లి నాగి, ధర్నా రాజశేఖర్, సీఐ వెంకటప్రసాద్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ పోతునేని భూమేష్, ఎస్సై పి.రామారావు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో అంతర్రాష్ట్ర యువత మార్పిడి సందడి









**వరంగల్ బ్యూరో (జర్నలిస్ట్ వార్త;**
కేంద్ర యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో మై భారత్ వరంగల్ నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర యువత మార్పిడి కార్యక్రమం ఈ నెల 20 నుంచి 24 వరకు ఐదు రోజులపాటు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 37 మంది యువతీ యువకులు పాల్గొంటున్నారు. కార్యక్రమం హనుమకొండ బాలసముద్రంలోని యువజన వసతి గృహంలో నిర్వహిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం, చారిత్రక ప్రదేశాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను అవగాహన చేసుకోవడం, అలాగే కర్ణాటక రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను స్థానిక యువతకు పరిచయం చేయడం ద్వారా జాతీయ సమైక్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు.
కార్యక్రమంలో భాగంగా కర్ణాటక నుంచి వచ్చిన యువత హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను సన్మానించారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయం, వేయి స్తంభాల ఆలయం, లక్నవరం ప్రాంతాలను సందర్శించి పర్యాటక ప్రాధాన్యతను తెలుసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న మతాలు, భాషలు, సంస్కృతులు కలిగిన దేశం జాతీయ సమైక్యతతో ముందుకు సాగాలని, యువత విద్యా వైద్య రంగాల్లో ముందడుగు వేయాలని సూచించారు.తదుపరి కార్యక్రమంలో భాగంగా కొత్తవాడలోని జరీ వస్త్ర పరిశ్రమను సందర్శించి జరీ వస్త్రాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. తెలంగాణ సంప్రదాయ పిండి వంటలపై అవగాహన పొందేందుకు రంగషాయపేటలోని గృహ ఆహార కేంద్రాన్ని సందర్శించారు.
అనంతరం హంటర్ రోడ్డులోని ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన జానపద నృత్యాలు, సాంస్కృతిక కళారూపాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో మై భారత్ వరంగల్ ఉప సంచాలకులు చింతల అన్వేష్, అధికారులు, వాలంటీర్లు, కర్ణాటక రాష్ట్ర యువజన ప్రతినిధులు, స్థానిక యువజన సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనవరి 25 న జాతీయ ఎన్నికల దినోత్సవం





**నర్సంపేట/జనవరి 23 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ నర్సంపేటలో భారత ఎన్నికల సంఘం మరియు కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ (సి సి ఈ) సూచనల మేరకు, రాబోయే జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని, శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రతిజ్ఞ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది , విద్యార్థులు పాల్గొని, భారత రాజ్యాంగ విలువలకు కట్టుబడి, కుల, మత, లింగ భేదాలు లేకుండా స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ఎన్నికల ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతపై యువతలో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని, ప్రతి పౌరుడు తన ఓటును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ద్వారా మంచి పాలన సాధ్యమవుతుందని ఆయన అన్నారు.ఎన్ ఎస్ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ, యువ ఓటర్లు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తిగా నిలుస్తారని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు వేయడం ద్వారా బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య తెలియచేస్తూ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, స్లోగాన్ రాసే పోటీలను రేపు నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని తెలియచేశారు.
ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్, ఎన్ సి సి క్యాడెట్స్ పాల్గొని విజయవంతం చేశారు.